క్లుప్తంగా

అనుమతి లేకుండా గ్రామ చావడి కూల్చివేత

తిరువూరు: స్థానిక చీరాల సెంటర్లో రీ సర్వే నెంబర్ 154/2లో బ్రిటిష్ కాలంలో నిర్మించిన రెవెన్యూ గ్రామ చావడిని శనివారం ప్రైవేటు వ్యక్తులు కూల్చివేశారు. గ్రామ కంఠం పోరంబోకులోని నాలుగు సెంట్లలో ఉన్న గ్రామ చావడి భవనాన్ని డోజర్‌తో నేలమట్టం చేశారు. అత్యంత విలువైన ఈ స్థలం అన్యాక్రాంతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ మైనారిటీ నాయకులు జాకిర్ విజ్ఞప్తి చేశారు. తిరువూరు తహసీల్దార్ లక్ష్మీని వివరణ కోరగా భవనం కూల్చివేతకు అనుమతులు ఇవ్వలేదన్నారు. చీరాల సెంటర్లోని తోపుడు బండ్ల వ్యాపారులకు గ్రామ చావడి తొలగించిన తదుపరి ఖాళీ స్థలాన్ని కేటాయించాలని ఎమ్మెల్యే శ్రీనివాసరావు నిర్ణయించారని చెప్పారు.

600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

చాత్రాయి: మండలంలోని పోతనపల్లి శివారు తోటల్లో సారా తయారు చేస్తున్నారన్న సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు దాడి చేశారు. నిల్వ ఉంచిన 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి కేసు నమోదు చేశారు.

జేఎన్టీయూ సెంట్రల్ జోన్ ఖోఖో సెలక్షన్స్



కేతనకొండ(ఇబ్రహీంపట్నం): జేఎన్టీయు కాకినాడ సెంట్రల్ జోన్ అంతర కళాశాలల ఖోఖో సెలక్షన్స్ కేతనకొండ ఆర్కే ఇంజినీరింగ్ కళాశాలలో జరిగాయి. పోటీలను కళాశాల చైర్మన్, చీరాల నియోజకవర్గం ఎమ్మెల్యే మద్దులూరు మాల కొండయ్య శనివారం ప్రారంభించి మాట్లాడారు. తమ కళాశాలలో ప్రతి ఏడాది బాక్సింగ్ పోటీలు నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది ఖోఖో సెలక్షన్స్ జరపడం ఆనందంగా ఉందన్నారు.జేఎన్టీయుకే స్పోర్ట్స్ కౌన్సిల్ చైర్మన్ శ్యాం కుమార్ మాట్లాడారు. 23 కళాశాలలకు చెందిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొని హోరాహోరీగా తలపడ్డారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రామకృష్ణయ్య, ఫిజికల్ డైరెక్టర్ వీవీ మురళీనాథ్, మల్లికార్జున తదితరులు క్రీడాకారులను అభినందించారు.

తమ్మిలేరు ప్రాజెక్టు నీటి సంఘం అధ్యక్షుడిగా రమేష్

చాత్రాయి: తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టు నీటి సంఘం ఎన్నికలు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా యర్రా రమేష్, ఉపాధ్యక్షుడిగా గుండా వెంకన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికల అధికారి సుందరి చేతుల మీదుగా ఎన్నికైన వారికి నియామక పత్రాన్ని అందజేశారు.

ప్రైవేట్ పాఠశాలల బాలలకు క్రీడా పోటీలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): విజయవాడ చిల్డ్రన్స్, ట్యుటోరియల్స్ అసోసియేషన్ కొండపల్లి డివిజన్ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ పాఠశాల ఆవరణలో ఉత్సాహభరితంగా క్రీడా పోటీలు శనివారం నిర్వహించారు. జి కొండూరు, ఇబ్రహీంపట్నం, గొల్లపూడి రూరల్ మండలాలకు చెందిన ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులకు పాల్గొన్నారు. లాంగ్ జంప్, షార్ట్ పుట్, రన్నింగ్, తదితర పోటీలు జరిగాయి. ఓవరాల్ చాంపియన్ క్రాంతి హైస్కూల్ కొండపల్లి, ద్వితీయ స్థానం క్రాంతి హైస్కూల్ కవులూరు, తృతీయస్థానం స్వాతి విద్యా నికేతన్ గొల్లపూడి నిలిచాయి.ఎంఈవో పుష్పలత, అసోసియేషన్ అధ్యక్షులు దేవినేని జోని కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపుపై ర్యాలీ



ఇబ్రహీంపట్నం: జాతీయ ఇంధన వారోత్సవాల సందర్భంగా ఎన్టీటీపీఎస్‌లో ఇంధన పొదుపుపై అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. సంస్థ సీఈ నాగరాజు మాట్లాడుతూ ఇంధనం మితంగా వాడటం ద్వారా దేశానికి ఆదాయం మిగులుతుందన్నారు. దేశ ముడిచమురు అవసరాల్లో 75 శాతం దిగుబడి ద్వారానే వస్తుందని చెప్పారు. శక్తి వినియోగానికి సహజ వనరులైన బొగ్గు, చమురు, సహజ వాయువు వేగంగా ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో సీనియర్, జూనియర్ ఇంజినీర్లు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని లీవ్ లవ్ లాఫ్ సేవా సంస్థ కో–ఆర్డినేటర్ కేశవ అన్నారు. కొండపల్లి హిల్ సంస్థ ఆధ్వర్యంలో ఈలప్రోలు, కొటికలపూడి, జూపూడి గ్రామాల్లో శనివారం జరిగిన ప్రపంచ ధ్యాన దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు, యోగా, ధ్యానం, ప్రాణాయామం చేయడం ద్వారా ఆరోగ్యం లభిస్తుందని వివరించారు. పీహెచ్‌సీ సిబ్బంది మహిళలతో ధ్యానం చేయించారు. కొండపల్లిలో శాంతివన్ యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధ్యాన దినోత్సవం జరిగింది. యోగా గురువు లంకే జనార్దన్ ధ్యానంపై అవగాహన కల్పించారు. ఎన్టీటీపీఎస్ అధికారులు పాల్గొన్నారు.



కొండపల్లి బీకాలనీ వద్ద కేక్ కట్ చేస్తున్న జోగి రమేష్, వార్డు కౌన్సిలర్లు



గంపలగూడెం గాంధీ సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న పార్టీ శ్రేణులు



కొటికలపూడిలో కేక్ కట్ చేస్తున్న సర్పంచి రెంటపల్లి నాగరాజు, నాయకులు

సంక్షేమ సారథి వైఎస్ జగన్

- వాడవాడలా జగన్ జన్మదిన వేడుకలు
- సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలను ఆదుకున్న వైఎస్ జగన్
- పలు చోట్ల సేవా కార్యక్రమాలు

ఇబ్రహీంపట్నం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల హృదయాల్లో సంక్షేమ సారథిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిలిచి ఉన్నారని పలువురు నాయకులు పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు మైలవరం, తిరువూరు, నూజివీడు నియోజకవర్గాల్లో శనివారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలకు జరిగిన మేలులను వివరించారు. ఇబ్రహీంపట్నం, జూపూడి, కొండపల్లిలో జరిగిన కార్యక్రమాల్లో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని కేకులు కట్ చేశారు. జూపూడి, కొండపల్లిలో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ సర్పంచి దారావత్ తార్యా నాయక్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దివ్యాంగులు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. జోగి రమేష్ మాట్లాడుతూ జగనన్న పాలనలో అమ్మఒడి, చేయూత, ఆసరా, పింఛన్ వంటి సంక్షేమ పథకాలు వలంటీర్ల ద్వారా ప్రతి గడపకు అందించారని కొనియాడారు. జగనన్న పాలన మళ్లీ కావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. వైస్ ఎంపీపీ బాణావత్ నాగబాలమ్మ, సర్పంచులు రెంటపల్లి నాగరాజు, నళినీ ఆశాలత, ఎంపీటీసీలు ముద్దంగుల రంగస్వామి, వులి సువర్ణరాజు, వార్డు కౌన్సిలర్లు జోగి రాము, బాడిశ నాగరాజకుమారి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మేడపాటి నాగిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు మిక్కిలి శరభయ్య, నాయకులు శివశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

- **గంపలగూడెం:** గంపలగూడెం గాంధీసెంటర్, రామమోహన్ సెంటర్, తోటమూల వై–జంక్షన్, తునికిపాడు, పెనుగొలను, ఊటుకూరు, కొణిజెర్ల, లింగాల, గోసవీడు, కనుమూరు, అనుముల్లంక, అర్లపాడు, నెమలి తదితర గ్రామాల్లో వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ కోట శామ్యూల్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు చెరుకు నర్సారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు,నాయకులు పాల్గొన్నారు.



పైడూరుపాడులో కేక్ కట్ చేస్తున్న నాయకులు



తలశిల రఘురాం కార్యాలయంలో వేడుకలు



మైలవరం వేడుకల్లో జోగి రమేష్, నాయకులు

పేదల సంక్షేమమే జగన్ అభిమతం

మైలవరం: పేదల సంక్షేమమే వైఎస్ జగన్ అభిమతమని వైఎస్సార్‌సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి జోగి రమేష్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు రొట్టెలు, పాలు పంపిణీ చేశారు. నాయకులు అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, అప్పడి సత్యనారాయణ రెడ్డి, చిలుకూరి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. మైలవరం మండలం పుల్లూరు శివారు కొత్తగూడెం సెంటర్‌లో భారీ కేక్‌ను మాజీ ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి కట్ చేశారు. రెడ్డిగూడెం మండలంలో వైఎస్సార్ సీపీ నాయకులు పి.విజయభాస్కరరెడ్డి కేక్ కట్ చేశారు.



చాత్రాయిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



లింగాలలో పుస్తకాలు, ప్యాడ్‌లు పంపిణీ

పొలిటికల్ సూపర్ స్టార్ వైఎస్ జగన్

జి.కొండూరు: చరిత్రలో నిలిచిపోయే సంక్షేమ పథకాలను అమలు చేసి దేశానికే ఆదర్శంగా నిలిచిన పొలిటికల్ సూపర్‌స్టార్ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని జోగి రమేష్ అన్నారు. జి.కొండూరులో నిర్వహించిన వేడుకల్లో కేక్ కట్ చేసి మాట్లాడారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వేములకొండ తిరుపతిరావు, ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మందా జక్రధరరావు, కేడీసీసీ మాజీ వైస్ చైర్మన్ వేములకొండ రాంబాబు, సర్పంచ్ మండల అరుణ, నాయకులు పాల్గొన్నారు.

రెడ్డిగూడెంలో అన్నదానం

మైలవరం: రెడ్డిగూడెం ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ సంస్థ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉయ్యూరు భరత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. సర్పంచ్ మల్లాది రాణి, ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు



ఇబ్రహీంపట్నంలో కేక్ కట్ చేస్తున్న జోగి రమేష్

- **మునునూరు:** జగనన్న సంక్షేమ పాలనాకాలం రాష్ట్ర చరిత్రలో స్వర్ణయుగమని ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కారుమూరి సునీల్ కుమార్ అన్నారు. శనివారం రాత్రి లోపూడిలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేసి, అన్నదానాన్ని ప్రారంభించి మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- **చాత్రాయి:** బూరుగుగూడెం, చాత్రాయిలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఏపీ కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర మాజీ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, నాయకులు గద్ద లోకేశ్వరెడ్డి, కారంగుల వాసు, పుచ్చకాయల సుబ్బారెడ్డి, పరసా చెన్నారావు, పామర్తి నాగేశ్వరరావు, నెల్లూరి రాజేష్, సంకు సత్యనారాయణ, కుప్పిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి గడ్డం శ్రీనివాసరెడ్డి, పోలవరంలో చెలికాని బాబ్జీ పాల్గొన్నారు.
- **పైడూరుపాడు(విజయవాడరూరల్):** పైడూరుపాడు పంచాయతీ కార్యాలయం వద్ద, ఎస్సీ కాలనీ, న్యూ ఎస్సీ కాలనీల్లో జరిగిన కార్యక్రమాల్లో సర్పంచి సీతారామయ్య, ఎంపీటీసీ సభ్యులు బయ్యారపు కల్పన, నాయకులు పాల్గొన్నారు. రాయనపాడులో, అశోక్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో పోలసాని వాసు, పోలసాని సురేష్, కలపాల రాజేష్, మల్లాది వెంకటేశ్వరరావు, మందా బాబురావు, వరకాల ఉదయ్ పాల్గొన్నారు.
- **పుస్తకాలు ప్యాడ్‌లు పంపిణీ**

లింగాల(గంపలగూడెం): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా లింగాల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు 120 మందికి గ్రామ పార్టీ శాఖ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, ప్యాడ్‌లు, పెన్నులను వైఎస్సార్ సీపీ నాయకులు గుత్తికొండ భాస్కర్‌రెడ్డి, సంగసాని వెంకటేశ్వర్లు, బంకా గణేష్, గుత్తికొండ నరేష్‌రెడ్డి తదితరులు పంపిణీ చేశారు. హెచ్ఎం వేముల రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- **గొల్లపూడిలో ..**

భవానీపురం(విజయవాడపశ్చిమ): శాసన మండలి సభ్యులు తలశిల రఘురాం ఆధ్వర్యంలో గొల్లపూడిలోని తలశిల రఘురాం కార్యాలయంలోను, ముస్లిం పేటలోను జగన్ పుట్టిన రోజు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. జగనన్న సంక్షేమ పాలన మళ్లీ రావాలని ఆకాంక్షించారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

- **కె.తాడేపల్లి(విజయవాడరూరల్):** పేదల పాలిట పెన్నిధి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మాజీ మంత్రి జోగి రమేష్ అన్నారు. కొత్తూరు, తాడేపల్లి గ్రామాల్లో జరిగిన వేడుకల్లో కేక్ కట్‌చేసి మాట్లాడారు. సర్పంచి ఉయ్యూరు గోపాలరావు, ఉప సర్పంచి పోతురాజు శేఖర్, ఎంపీటీసీ అజ్మీర బసవమ్మ, నాయకులు పాల్గొన్నారు.



రెడ్డిగూడెంలో అన్నదానం



తోటమూల వై జంక్షన్ వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు



లోపూడి వేడుకల్లో కారుమూరి సునీల్ కుమార్, నాయకులు



జి.కొండూరులో మాట్లాడుతున్న జోగి రమేష్



రమణక్కపేట వేడుకల్లో పాల్గొన్న నాయకులు

పేదల సంక్షేమానికి జగన్ కృషి

తిరువూరు: పేదల సంక్షేమానికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన కృషి మరువలేనిదని వైఎస్సార్ సీపీ తిరువూరు మండల శాఖ అధ్యక్షుడు శీలం నాగనర్సిరెడ్డి అన్నారు. శనివారం తిరువూరులో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రావలన్నారు. నగర పంచాయతీ చైర్మన్ గత్తం కస్తూరిబాయి, ఎంపీపీ భారతి, కౌన్సిలర్లు పర్స శ్రీనివాసరావు, పసుపులేటి శేఖర్, మోదుగు ప్రసాద్, సత్యనాయణ, చిన్నారి, దుర్గారావు, నాయకులు సీహెచ్ సత్యనారాయణ, వాళ్ల సురేష్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు. మునుకుళ్ళ, వావిలాల, మల్లెల, పెద్దవరం, అక్కపాలెం, కోకిలంపాడు గ్రామాల్లో జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు.



తిరువూరు వేడుకల్లో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

అధికారమున్నా.. లేకున్నా ప్రజల పక్షమే

నూజివీడు: అభివృద్ధి, సంక్షేమానికి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యతనిచ్చారని, అధికారమున్నా లేకున్నా ఆయన ప్రజల పక్షానే ఉంటారని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. నూజివీడు పట్టణంలోని చిన్నగాంధీ బొమ్మ సెంటర్‌లో కేక్ కట్ చేసి మాట్లాడారు. నూజివీడు నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందంటే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనేనని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు పగడాల సత్యనారాయణ, కొప్పుల ప్రదీప్, మీర్ అంజాద్ ఆలీ, ముస్లిం మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్ యూనిస్ పాషా (గబ్బర్), క్రిస్టియన్ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్, నాయకులు బసవా వినయ్, గాదెరెడ్డి రంజిత్‌రెడ్డి, బర్రే చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



నూజివీడులో మాట్లాడుతున్న మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అందరికీ పథకాలు

విసన్నపేట: స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎన్‌వీ కుటుంబరావు అధ్యక్షతన వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. కేక్‌కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. సర్పంచ్ నాగమల్లేశ్వరి, నాయకులు భూక్యా రాణి, ఓలేటి దుర్గారావు, సిరసాని ప్రకాష్, జి. మల్లయ్య, కోట శ్రీను, పి. లక్ష్మయ్య, జయరాజు, రెడ్డి శేషగిరి, జయకర్ అలీ, రెహమాన్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు. పుట్రేలలో ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ జగన్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ కె. స్వాతి, ఎంపీటీసీ నాగేశ్వరరావు, అంజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



విస్సన్నపేట ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

సంక్షిప్తం

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

తిరువూరు రూరల్: జాతీయ గణిత దినోత్సవాన్ని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టేల, లక్ష్మీపురం ప్రాథమికోన్నత పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమంలో గణిత మేధావి, శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రామానుజన్ జీవిత చరిత్రను ఉపాధ్యాయులు వివరించారు. గణితంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు పీవీఎస్ ప్రసాద్, ఎం. హరి కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

గంపలగూడెం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. తోటమూలలో శనివారం నిర్వహించిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ద్వారానే రాజకీయ నాయకులు నేడు పదవులను పొందుతున్నారన్నారు. ప్రజా సంఘాల నాయకులు ఆదాం, ఎం. కుటుంబరావు, దానియేలు, సునందరావు, శంకరరావు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్ల అందజేత

చాత్రాయి: చనుబండ హైస్కూల్లోని విద్యార్థులకు పూర్వ విద్యార్థులు సైకిళ్లు అందజేశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు ముల్పూరి బాల కోటిరెడ్డి, కో–ఆర్డినేటర్ లక్ష్మీ వాసిరెడ్డి, సభ్యులు వజ్రాల రాజగోపాల్ మండలంలోని చనుబండ జెడ్పీ హైస్కూల్లో 1978– 83 బ్యాచ్ విద్యార్థులు. వీరంతా తాము చదువుకున్న పాఠశాలకు దూరం నుంచి వస్తున్న 8వ తరగతి చదువుతున్న 25 మంది బాలికలకు శనివారం సైకిళ్లు అందజేశారు. ఎంఈఓ బ్రహ్మాచారి, హెచ్ఎం అమరయ్య పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు రామానుజన్



మైలవరం: గణిత మేధావి రామానుజన్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఎం. నాగేశ్వరరెడ్డి అన్నారు. రెడ్డిగూడెంలోని నారాయణ హైస్కూల్‌లో ఎంఎన్ఆర్ ఫౌండేషన్, యూటీఎఫ్ ఉపాధ్యాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను శనివారం పంపిణీ చేశారు. నూజివీడులోని త్రివిధ హైస్కూల్‌లో, శారదా కళాశాలలో గణిత దినోత్సవం నిర్వహించి రామానుజన్‌కు నివాళులర్పించారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ

రామచంద్రాపురం(విసన్నపేట): రామచంద్రాపురం వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయంలో సీసీ కెమేరాల వైర్లు తొలగించి చోరీకి పాల్పడ్డారు. ఈ విషయమై దేవాలయ నిర్వాహకుల ఫిర్యాదు మేర పోలీసులు కేసు నమోదుచేశారు. సుమారు రూ.లక్షన్నర విలువైన వెండి, బంగారు నగలను దొంగలు చోరీ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సారా తయారీదారులకు బెల్లం విక్రయాలు వద్దు

నూజివీడు: కల్లులో మత్తు పదార్థాలు కలిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ ఎ. మస్తానయ్య హెచ్చరించారు. స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో కల్లు సొసైటీల అధ్యక్షులకు, బెల్లం వ్యాపారులకు శనివారం సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ బెల్లం వ్యాపారులు సారా తయారీదారులకు నల్ల బెల్లం, తెల్ల బెల్లం విక్రయించవద్దని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా బెల్లం విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బెల్లం వ్యాపారులు ప్రతి 15 రోజులకు బెల్లం విక్రయాలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం ఎక్సైజ్ నేరాలకు పాల్పడిన పాత నేరస్తులను తహసీల్దార్ బీవీ సుబ్బారావు వద్ద బైండోవర్ చేశారు.

రేషన్ డీలర్‌పై ఫిర్యాదు

తిరువూరు: పట్టణంలోని 8వ వార్డులో రేషన్ సరుకులు పేదలకు సక్రమంగా అందడం లేదని వార్డు కౌన్సిలర్ నాళ్ల సురేంద్ర తహసీల్దార్ లక్ష్మీకి శనివారం ఫిర్యాదు చేశారు. రేషన్ సరుకులు పంపిణీ జరగక పోవడంతో తెల్లరేషన్ కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.డీలర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం



మునునూరు: క్రీస్తు బోధనలు అనుసరణీయమని మునునూరు ఆర్‌సీఎం విచారణకర్త రెవ ఫాదర్ జోసఫ్ తంబి అన్నారు. సెమీ క్రిస్మస్ వేడుకలు శనివారం రాత్రి మునునూరు ఆర్‌సీఎం చర్చి వద్ద ఘనంగా నిర్వహించారు. సహాయక ఫాదర్లు ఇలవర్సన్, నోవిస్ మాస్టర్ జోయ్ అమల్, క్లారెట్ ఫాదర్ నిర్మల్ కుమార్, సంఘ పెద్దలు కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. యూత్ సభ్యులు ప్రదర్శించిన క్రీస్తు జనన నాటిక, సంగీత రూపకం ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రేమ విందు జరిగింది. రమణక్కపేటలోని బైబిల్ మిషన్ పాస్టర్ దగ్గుమిల్లి సుధీర్‌బాబు ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. మునునూరులోని బాలికల గురుకుల విద్యాలయంలో ప్రిన్సిపాల్ ప్రవీణ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు.

అవుట్ సోర్సింగ్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): గిరిజన పాఠశాలల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. కొండపల్లి గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల వద్ద ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా శనివారం నిరసన చేపట్టారు. సీఐటీయు మండల కార్యదర్శి ఎం. మహేష్ మాట్లాడుతూ ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి టీచర్ల సమస్యల పరిష్కరించాలని కోరారు. ఉపాధ్యాయులకు మద్దతుగా పాఠశాల విద్యార్థినులు నిలిచారు. ఎస్ఎఫ్ఐ మండల నాయకులు బి. కౌశల్ కుమార్ పాల్గొన్నారు.

గ్రామ రెవెన్యూ సదస్సులు

మైలవరం: అధికారులు అందుబాటులో ఉంటున్నారా అని, స్థానిక సమస్యలపై స్పందిస్తున్నారా అని తిరువూరు ఆర్డీఓ మాధురి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. రెడ్డిగూడెం మండలం రుద్రవరం గ్రామంలోని గ్రామ సచివాలయంలో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొని గ్రామస్తుల నుంచి ఏడు అర్జీలు స్వీకరించారు. అనంతరం స్థానిక ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు.